క్లుప్తంగా

పాతనేరస్తులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీసీపీ నాగన్న

సింహాచలం: పెందుర్తి క్రైం పోలీస్ స్టేషన్‌ను ఆదివారం క్రైం డీసీపీ నాగన్న సందర్శించారు. పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వారంతా ప్రస్తుతం ఎక్కడెక్కడ నివసిస్తు న్నారు.. ఏయే వృత్తులు చేస్తున్నారో అని ఆరా తీశారు. వారి వారి వ్యక్తిగత సమాచారం అడిగి తెలుసుకున్నారు. సక్రమ మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో క్రైం ఎస్‌ఐ సల్మాన్ బేగ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: బంగారమ్మతల్లి భక్త బృందం ఆధ్వర్యంలో జనరేషన్ యువ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీఐ రంగనాథం ప్రారంభించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు యువత ముందుకు రావాలన్నారు.రక్తదానం చేయడం వల్ల అనారోగ్యం పాలవుతారనే అపోహలను ప్రతి ఒక్కరూ విడనాడాలన్నారు. మనం చేసే రక్తదానం వల్ల ప్రాణం కాపాడవచ్చని తెలియజేశారు. శిబిరంలో సుమారు 140 మంది యువతీ యువకులు పాల్గొనగా 100 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో హెచ్‌సీ కేటీఎస్ శ్రీనివాస్, పీసీలు సాయి, నర్సింగరరావు, జోడుగుళ్ల బంగారుతల్లి భక్త బృందం సభ్యులు, యువకులు పాల్గొన్నారు.


పోర్టు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యవర్గం

ఎంవీపీ కాలనీ: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఎస్సీ, ఎస్టీ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఎంవీపీ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దేవీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జి.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రసన్నకుమార్, డాక్టర్ టీఎస్ దీప్తి ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గ సభ్యులకు అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ కన్వీనర్ ఎం.ఎస్.ఎస్.ఎస్.సింగ్ పర్యవేక్షించారు.

15 నుంచి చేనేత ఉత్పత్తుల ప్రదర్శన

బీచ్ రోడ్డు: క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీసీఏపీ) ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ బజార్ పేరుతో చేనేత హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీసీఏపీ సంయుక్త కార్యదర్శి రేణుకా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. దసపల్లా హిల్స్‌లోని గాంధీ కమ్యూనిటీ సెంటర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో బొబ్బిలి చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు, కళాఖండాలు, స్కోల్ అండ్ మార్బుల్ గులక రాళ్లు, చేతితో అత్యంత కళాత్మకంగా తయారు చేసిన అనేక రకాల ఆకృతుల్లో తాటాకు బుట్టలు, బంజార సూది వర్క్ వంటివి అందుబాటులో ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటలకు వరకు ఈ ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఔట్‌పోస్ట్ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం గాజువాక జోగవానిపాలేనికి చెందిన బోను సూర్యనారాయణ (74) ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో రైలు పట్టాలు దాటుకుంటూ ఫార్మా సిటీ కాలనీ వైపు వెళ్తున్నాడు. ఈ సమయంలో అనకాపల్లి నుంచి దువ్వాడ వైపు వస్తున్న గూడ్స్ రైలు అతన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లోకో పైలట్ సమాచారం మేరకు దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుని వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.



పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి



వేపగుంట జెడ్పీ హైస్కూల్లో పోలీసులకు సూచనలిస్తున్న సీఐ అప్పారావు



పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

ఎమ్మెల్సీ పోలింగ్‌కు వేళాయె

- పోలింగ్ కేంద్రాలకు చేరిన సామగ్రి, సిబ్బంది
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు
- కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్‌కు పెందుర్తి నియోజకవర్గంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల్లోని పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. ఆదివారం సాయంత్రానికే పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం నుంచే పోలీసులు చేరుకోవడంతో పోలింగ్ కేంద్రాల వద్ద సాధారణ ఎన్నికల వాతావరణం తలపిస్తోంది. పట్టభద్రుల ఓటర్ల కోసం గదుల వద్ద బూత్ నంబర్లతో కూడిన చార్టులు పెట్టారు. ఏయే బూత్‌లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారో తెలుపుతూ ముందుగా ఓ బోర్డు ఏర్పాటు చేశారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలకు ఆదివారం ఆర్టీసీ బస్‌లలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రితో పోలీస్ బందోబస్తు మధ్య కేంద్రాలకు చేరుకొన్నారు.

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్లో 219,220,221 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్‌కు అనుమతిస్తారు. ఓటు వేసే పట్టభద్రులు తమవెంట ఓటరు స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం ధృవీకరించిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని పెందుర్తి తహసీల్దార్ ఆనంద్ కుమార్ తెలియజేశారు. పెందుర్తి మండలంలో మొత్తం 9811మంది పట్టభద్రులు ఓటు హక్కువిని యోగించుకోనున్నారు.

పరిశీలించిన అధికారులు

ఎన్నికలు జరిగే ఐదు కేంద్రాల వద్ద పెందుర్తి పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసులకు నార్త్ ఏసీపీ



పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

అన్నెపు నర్సింహమూర్తి పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం పలు సూచనలు చేశారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయా కేంద్రాలను డీసీపీ-2 ఆనంద్‌రెడ్డి, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సీఐ గొలగాని అప్పారావుతో కలిసి పరిశీలించారు. ఓటరు స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం ధృవీకరించిన ఏదైనా గుర్తింపు కార్డు పరిశీలించిన తర్వాతే ఓటరుని కేంద్రంలోకి అనుమతించాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎలాంటి వాహనానికి ప్రవేశం లేదన్నారు. కేంద్రానికి వంద మీటర్ల దూరం నుంచి కేవలం ఓటర్లను మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఓటర్లు తమ వెంట సెల్‌ఫోన్‌లు తీసుకురావద్దని సూచించారు.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు సర్వం సిద్ధం

పరవాడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం



పెందుర్తి ఉన్నత పాఠశాలలో బందోబస్తుపై సూచనలిస్తున్న డీసీపీ-2 ఆనంద్‌రెడ్డి

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలలో సిద్ధం చేసిన పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. మండలంలో 2,102 మంది పట్టభద్రులు సోమ వారం తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నా రు. పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలలో 201, 201ఎ పోలింగ్ బూత్‌లు, ఉక్కునగరం బాల విహార్ పాఠశాలలో 202, 203 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద వైద్య సదుపాయం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎలాంటి వాహనాలను అనుమతించరు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి వీలుగా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

సబ్బవరంలో 1899 మంది పట్టభద్రులు

సబ్బవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ



వేపగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్నికల నిర్వహణ పనుల్లో సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు 200,200ఎలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు. తహసీల్దార్ బి. సత్యనారాయణ పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఐ రంగనాథం బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రశాంత వాతావరణంలో పట్టభద్రుల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.మండలంలో 1899 మంది పట్టభద్రులు ఉన్నారు. వీరిలో 1139 మంది పురుషులు, 759 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

అరకు అందాలు మైమరిపిస్తాయి..

- ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి
- నేషనల్ గ్రూప్ షో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో చిత్రాలను తిలకిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: అరకు అందాలను నేరుగా చూసినా, చిత్రాల్లో చూసినా మనస్సును మైమరిపిస్తాయని తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఏర్పాటు చేసిన నేషనల్ గ్రూప్ షో ద్వారా తెలిసిందని ఏయూ వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. తెలుగు ప్రపంచ చిత్రకారులు సమాఖ్య ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో నేషనల్ గ్రూప్ షో పేరుతో మూడు రోజుల పాటు జరగనున్న ఎగ్జిబిషన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను చిత్రాల ద్వారా బంధించి రాబోయే తరాలకు అందించాలన్నారు. చిత్రలేఖనం అంత సులభం కాదన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు గీసిన చిత్రాలు మనస్సును హత్తుకుంటున్నాయన్నారు. నగరవాసులు ఈ ప్రదర్శనను సందర్శించి గిరిజన జీవన శైలిని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ డి.సింహాచలం, ఎస్.శ్రీనివాస్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహన ర్యాలీ

బీచ్ రోడ్డు: ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం సాగరతీరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, నగర యువత పాల్గొన్నారు. గ్లకోమా అనేది కంటిపై ఒత్తిడి పెరుగుదలతో వచ్చిన సమస్య అని, ఇది కోలుకోలేని అంధత్వానికి దారితీస్తుందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



పురుషోత్తపురంలో కేక్ కట్ చేస్తున్న 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ప్రతీ పేదవాడి కళ్లలో ఆనందం నింపాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీని స్థాపించారని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 12 ఏళ్లు పూర్తిచేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెట్టిన తరుణంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను పురుషోత్తపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేముడు కేక్‌కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నెండేళ్ల కిందట మార్చి 12వతేదీ దేశచరిత్రలోనే ఒక కొత్త అధ్యాయం ఆరంభమైందన్నారు. పార్టీ స్థాపించిన తర్వాత ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా, ఎంతమంది ఇబ్బందులకు గురిచేసినా జగన్‌మోహన్‌రెడ్డి మొక్కవోని పట్టుదలతో పార్టీని ముందుకు తీసుకెళ్లారన్నారు. ప్రతిపక్షనేత హోదాలో ప్రజాసంకల్పయాత్ర చేసి ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అండగా నిలుస్తున్నారన్నారు.

కీటకాహార మొక్కలు



కీటకాలను ఆకర్షించే తిత్తె వంటి నిర్మాణం



కీటకాలను ఆహారంగా తీసుకునే మొక్క

ఏయూ క్యాంపస్: కీటకాహార మొక్క పెదవాల్తేరులోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో కనువిందు చేస్తోంది. ఒక మొక్క పదికిపైగా ప్రత్యేకమైన సంచులతో వృక్షశాస్త్ర పరిశోధకులు, విద్యార్థులను ఆకట్టుకుంటోంది. ట్రయాంగులరిస్‌గా వ్యవహరించే ఈ చెట్టు ఆకు మధ్య ఈనె ఒక తిత్తిగా మారిపోతుంది. తిత్తె చుట్టూ మకరందం వంటిది ఏర్పడుతుంది. ఇది కీటకాలను ఆకర్షిస్తుంది. అందమైన రంగులతో కనిపించే ఈ తిత్తెను చూసి కీటకాలు దీనికి ఆకర్షితమవుతాయి. దీనిని తాకిన వెంటనే కీటకాలు ఆ తిత్తెవంటి సంచిలోకి జారిపోతాయి. వీటిని ఆహారంగా మార్చుకుని జీర్ణంచేసుకునే లక్షణం కలిగి ఉండటం దీని ప్రత్యేకత. కీటకాలను ఆరగించి, జీర్ణం చేసుకుంటుంది. ఈ మొక్కలను ప్రత్యేక పరిస్థితుల్లో పెంచుతారు. వీటికి నేరుగా ఎండ తలగకూడదు. నీడనిచ్చే ప్రాంతాలలో కుండీలలో వీటిని పెంచుతారు. దీనికి ప్రత్యేకంగా ఆర్‌ఓ వాటర్, సహజ సిద్ధమైన వర్షపు నీటిని మాత్రమే వినియోగించాలి. మేఘాలయలో దట్టమైన అటవీ ప్రాంతాలలో ఇవి కనిపిస్తాయని జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. నెపెంథిస్ జాతికి చెందిన మొక్కలుగా వీటిని వ్యవహరిస్తారు.

పౌర గ్రంథాలయంలో సంగీత విభావరి రేపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎస్‌కే మహంతి, అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: సినీ సంగీత దర్శకుడు కేవీ మహదేవన్ జయంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మా, సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ సంయుక్తంగా మంగళవారం విశాఖ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు హైకోర్టు న్యాయవాది, ఆయా సంస్థల అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి తెలిపారు. ఆదివారం రామ్‌నగర్‌లో ఉన్న ట్రస్ట్ కార్యాలయంలో రాష్ట్ర శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూషా పట్నాయక్‌తో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మహంతి మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా కళా రంగానికి తనగాన మాధుర్యంతో అలరిస్తున్న జామి శివ అప్పలరాజుకు స్వర కళా పురస్కారం అవార్డు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. 14న సాయంత్రం 6 గంటలకు పౌర గ్రంథాలయంలో నగరానికి చెందిన గాయనీ గాయకులు కేవీ మహదేవన్ స్వరపరచిన చిత్ర గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత కళాకారుల గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఘంటసాల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం

ఎంవీపీ కాలనీ: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఎంవీపీ కాలనీ సెక్టార్-3లో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో భాగంగా త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన 100 ఆధ్యాత్మిక గ్రంథాలను పంపిణీ చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల గురించి తెలియజేయడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు త్రినాథరావు, శ్రీనివాస్, సన్యాసి, అంకమ్మ, బంగారుతల్లి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైల్వే ఉద్యోగులు, అధికారుల కోసం వాల్తేర్ డివిజన్ ఆదివారం దొండపర్తిలోని రైల్వే హాస్పిటల్‌లో న్యూరో, కార్డియాలజీ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించింది. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరు అరుల్ జోతి పర్యవేక్షణలో రైల్వే ఆస్పత్రి వైద్యుల బృందం సేవలందించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని మాట్లాడారు. వ్యక్తిగత ఆరోగ్యం, పోషణ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి రైల్వే ఉద్యోగి, సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు. నిర్దేశిత సమయాల్లో ఇటువంటి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైల్వే ఆస్పత్రిలో అనుభవజ్ఞులైన వైద్యులు, సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని వినియోగించుకోవాలని ఉద్యోగులకు ఆయన సూచించారు. అధికారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వారికి నాణ్యమైన వైద్యం అందించే ఉద్దేశంతో ఈ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఎం చెప్పారు. మెడికల్ క్యాంప్‌లో సుమారు 57 మంది అధికారులు, 3 కుటుంబాల సభ్యులు వైద్య పరీక్షలు చేయించుకోగా.. వీరిలో కొత్తగా నలుగురు హైపర్ టెన్షన్‌తో, ఇద్దరు డయాబెటిస్ మెల్లిటస్‌తో, ఇద్దరు ఇస్కిమిక్ హార్ట్ డిసీజస్‌తో బాధపడుతున్నట్లు కనుగొన్నారు.

సూర్యనారాయణమూర్తి పాదాలను తాకిన కిరణాలు



సూర్యనారాయణమూర్తి మూలవిరాట్టును తాకిన కిరణాలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట అలమేలు మంగమ్మ ఆలయంలోని శ్రీ సూర్యనారాయణమూర్తి మూలవిరాట్టును ఆదివారం సూర్యకిరణాలు తాకాయి. ఆలయ అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు స్వామికి విశేష పూజలు చేశారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల మధ్య ఈ విశేషం జరిగినట్లు తెలిపారు. ప్రతి ఏడాది మూడు రోజుల పాటు ఇలా జరుగుతుందని ఆయన తెలిపారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



ప్రీమియర్ లీగ్ క్రికెట్ ట్రోఫీ ఆవిష్కరించిన సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలి నగర్ సాధన క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా ఆదివారం ప్రారంభించారు. క్రికెట్ పోటీల్లో ఉద్యోగులను పాల్గొనేలా కృషి చేసిన క్రీడామండలి ప్రతినిధులను కొనియాడారు. నెల రోజుల పాటు నిర్వహించే క్రికెట్ పోటీల్లో 15 జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో సంస్థకు చెందిన సీజీఎం(యూఎస్ఎస్‌సీ) గోవిందరాజన్, ఓ అండ్ ఎం జీఎం బి.పి.పాత్రో, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.